యూరియా కోసం రైతుల పాట్లు

యూరియా కోసం రైతుల పాట్లు పడుతున్నారు. ఆదివారం మెదక్ జిల్లావ్యాప్తంగా తెల్లవారు జామునుంచే ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, రైతు వేదికలు, పీఏసీఎస్ సొసైటీలు, ఎరువుల కేంద్రాల వద్ద బారులు తీరారు. కొన్ని చోట్ల క్యూలైన్‌లో నిలబడి టోకెన్‌లు తీసుకుని యూరియా పొందారు. కొన్ని చోట్ల రైతులకు సరిపడా యూరియా రాక రైతులు వెనుదిరిగారు. కొన్ని ప్రాంతాల్లో రైతులు గొడవకు దిగారు. పలుచోట్ల రాస్తారోకో చేపట్టారు.


శివ్వంపేట(నర్సాపూర్): రాస్తారోకో చేస్తున్న రైతులు


నిజాంపేట(మెదక్): నిజాంపేట సొసైటీ వద్ద..


నర్సాపూర్: యూరియా కోసం సొసైటీ వద్ద నిరీక్షిస్తున్న రైతులు


కొల్చారం(నర్సాపూర్): ఎనగండ్ల రైతు వేదిక వద్ద యూరియా కోసం రైతులు

క్లుప్తంగా

లైన్ ఇన్‌స్పెక్టర్ దిగంబర్ సేవలు అభినందనీయం


దిగంబర్‌ను సన్మానిస్తున్న ఏఈ దినకర్, సిబ్బంది

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన విద్యుత్‌శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ దిగంబర్ సేవలు అభినందనీయమని విద్యుత్‌శాఖ ఏఈ దినకర్ అన్నారు. ఆదివారం లైన్ ఇన్‌స్పెక్టర్ దిగంబర్ పదవి విరమణ పొందగా.. మండల కేంద్రంలోని విద్యుత్ సెక్షన్ కార్యాయలంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఏఈ దినకర్, విద్యుత్‌శాఖ సిబ్బంది దిగంబర్‌ను శాలువాతో సత్కరించారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి


దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

హవేళిఘణాపూర్(మెదక్): వరదలతో కొట్టుకుపోయి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50 వేల చొప్పున చెల్లించాలని సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని సర్దన, పోచమ్మరాల్, జక్కన్నపేట గ్రామాల్లో ఆయన పర్యటించి రైతుల పంట పొలాలను పరిశీలించారు. వర్షాలతో ఇళ్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజు, దుర్గ, ఆశయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థుల పొలంబాట


పంటలను పరిశీలిస్తున్న విద్యార్థులు

జహీరాబాద్: కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థులు రూరల్ హార్టికల్చర్ వర్క్ అనుభవ ప్రోగ్రాంలో భాగంగా ఆదివారం బాబానగర్‌లో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా సాగు విధానం గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో అనేక రకాల పంటలను పరిశీలించామని, ఇది తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రదీప్‌కుమార్, విద్యార్థులు భార్గవి, మాయావతి, అక్షిత, అనిత, నవ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాజుల పండుగ

జహీరాబాద్: కోహీర్ మండల పరిధి మదిరి గ్రామంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాజుల పండుగ నిర్వహించారు. ఆదివారం నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా మహిళలకు గాజులు తొడిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి సంప్రదాయంతో కుటుంబ అనుబంధం బలపడుతుందన్నారు. కార్యక్రమంలో రేణుక, సురేఖ, అనుషమ్మ, పద్మ, పెంటమ్మ, శంకరమ్మ, మొగులమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

పదవీ విరమణ సెకండ్ జర్నీ లాంటింది

డీఎస్పీ నరేందర్‌గౌడ్


శ్రీనివాస్‌రావును సత్కరిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్ తదితరులు

చిన్నశంకరంపేట(మెదక్): ప్రతి ఉద్యోగికి ఉద్యోగ పదవీ విరమణ సెకండ్ జర్నీకి నాంది పలుకుందని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం చిన్నశంకరంపేట పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌రావు పదవీ విరమణ సభలో ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన పోలీస్ ఉద్యోగంలో ఎలాంటి రిమార్క్ లేకుండా పదవీ విరమణ పొందుతున్న శ్రీనివాస్‌రావు అభినందనీయుడని అన్నారు. కర్మశిక్షణతో నిజాయితీగా పనిచేసీ అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు. పోలీస్ ఉద్యోగంలో ప్రజలకు సేవలు అందించిన శ్రీనివాస్‌రావు ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబంతో గడపాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు దంపతులను డీఎస్పీ శాలువతో సత్కరించి మోమెంటో అందించారు. కార్యక్రమంలో రామాయంపేట సీఐ వెంకటరాజంగౌడ్, చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్, చేగుంట, నార్సింగి, నిజాంపేట చైతన్యరెడ్డి, సృజన, రాజేష్ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు


ధ్వంసం అయిన కాజ్‌వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్: తూప్రాన్- గుడ్రెడ్డిపల్లి మార్గంలోని హల్దీ వాగుపై నిర్మించిన కాజ్‌వేకు రూ. 4.5 కోట్ల నిధులతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించినట్లు ఆర్డీఓ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కాజ్‌వేను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ నీటి ప్రవాహంతో కాజ్‌వే ధ్వంసం అయి కనీసం నడవలేని పరిస్థితి నెలకొందన్నారు. కాజ్‌వే బదులుగా వంతెన నిర్మాణం చేపట్టే విధంగా కృషి చేస్తామన్నారు. ఇందుకోసం రూ.4.5 కోట్ల నిధుల అంచనాలతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. దీంతో రానున్న రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. అనంతరం కిష్టాపూర్ హల్దీవాగుపై నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో గ్రామాలకు రాకపోకలు కొనసాగుతున్నాయని తెలిపారు.

పండుగలతో యువత సంఘటితం

చిన్నశంకరంపేట(మెదక్): పండుగలు యువతను సంఘటితం చేస్తాయని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వినాయ మండపాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మికతను చాటుతాయని, యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు, మాజీ సర్పంచ్‌లు కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, యాదగిరి, సుధాకర్ ఉన్నారు.

విద్యార్థుల ఇబ్బందులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి రేజింతల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద రహదారి అధ్వానంగా మారింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల సమీపంలో గుంతల్లో వర్షపు నీరు నిల్వడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గుంతల్లో వర్షం నీరు నిల్వడంతో విద్యార్థులు అందులో పడి ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని గుంతలను పూడ్చివేయాలని కోరుతున్నారు.

అసైన్డ్ భూములపై బిల్లు ప్రవేశపెట్టాలి

నిజాంపేట(మెదక్): అసైన్డ్ భూములపై అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాలని అసైన్డ్ భూ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైండ్ల నందు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏబీఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరంగల్‌లో జరిగిన రైతు గర్జన మహాసభలో రాహుల్ గాంధీ సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే అసైన్డ్ భూములపై ఆంక్షలు ఎత్తివేసి పూర్తి హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చినా ఊరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనిల్ కుమార్, దయాకర్, మహిపాల్, సిద్ధ రాములు, కిష్టయ్య, రాజేందర్, స్వామి, నర్సింలు, రాజయ్య, పెంటయ్య, రాజేశం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏబీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైండ్ల నందు

అభ్యంతరాలుంటే తెలపండి

తూప్రాన్ ఎంపీడీఓ సతీశ్

తూప్రాన్/కొడిపల్లి(నర్సాపూర్)/వెల్దుర్తి(తూప్రాన్)/చిన్నశంకరంపేట(మెదక్): త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆదివారం మండలంలోని రాజకీయ నాయకులతో ఎంపీడీఓ సతీశ్ తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారులు ఇప్పటివరకు ఓటరు జాబితాను అందజేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. కొడిపల్లి మండలంలోని వివిధ పార్టీల నాయకులతో ఎంపీడీఓ శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, ఇతర సమస్యలపై రాజకీయ పార్టీల నాయకులతో మాసాయిపేట ఎంపీడీఓ విఘ్నేశ్వర్ సమావేశం నిర్వహించారు. చిన్నశంకరంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దామోదర్ సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల నాయకుల అభిప్రాయాలతో పాటు గ్రామాల్లో అందించిన అభ్యంతరాలను పరిశీలించి తుది ఓటరు జాబితాను రూపొందించి జాబితాను ప్రకటిస్తామన్నారు. నార్సింగి మండల కేంద్రంలో ఎంపీడీఓ ఆనంద్‌కుమార్ నాయకులతో మాట్లాడారు.

నర్సాపూర్: ఓటరు జాబితాలు అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రదర్శనకు పెట్టామని ఎంపీడీఓ మధులత చెప్పారు. ఆదివారం ఆయా రాజకీయ పార్టీల మండలశాఖల ప్రతినిధులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. ఓటరు జాబితాలు అంతటా అందుబాటులో ఉన్నాయని, ఏమైనా తప్పులు ఉంటే నిర్ణీత సమయంలో తమ దృష్టికి తేవాలని సూచించారు. కొన్ని గ్రామాల్లో చనిపోయిన వ్యక్తుల పేర్లు ఉన్నాయని వాటిని తొలగించడంతో పాటు కొత్తగా కొందరి పేర్లు చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీఓ స్పందిస్తూ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. సమావేశంలో ఆయా పార్టీల నాయకులు శేఖర్, ఉదయ్ కుమార్, నగేశ్, జనార్దర్ తదితరులు పాల్గొన్నారు.


తూప్రాన్: నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సతీశ్


నిజాంపేట(మెదక్): నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

రాజకీయ నాయకులతో సమావేశం

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంలో ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎంపీడీఓ రాజిరెడ్డి అధ్యక్షతన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ ఓటర్ జాబితా పోలింగ్ కేంద్రాల గురించి వివరించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన కార్యదర్శులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.


నర్సాపూర్: మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఓటరు జాబితా సిద్ధం

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేశామని.. మార్పులకు సంబంధించిన ఏవైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని, మండల రాజకీయ నాయకులకు ఎంపీడీఓ ప్రశాంత్ తెలియజేశారు. ఆదివారం ఆయన మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు జాబితా అభ్యంతరాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 17,840 ఓటర్లు ఉండగా, 156 వార్డులు ఉన్నాయన్నారు. వాటి తుది జాబితా ఎంపీడీఓ కార్యాలయంలో ఉంచామన్నారు.

అల్లాదుర్గం(మెదక్): స్థానిక సంస్థలకు సంబంధించి ఓటర్‌లిస్టు అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ చెప్పారు. ఆదివారం ఎంపీపీ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. జాబితా ఏమైనా అభ్యంతరాలుంటే చెప్పాలని కోరారు.

యేసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

ప్రొఫెసర్ డా.కె.రూబెన్‌మార్క్


శివాయిపల్లి చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న పాస్టర్‌లు

పెద్దశంకరంపేట(మెదక్): యేసుక్రీస్తు ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ముంబయి రైవా ప్రొఫెసర్ డాక్టర్ కె.రూబెన్ మార్క్ అన్నారు. ఆదివారం పెద్దశంకరంపేటలో సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ప్రార్థనలో పాల్గొన్న అనంతరం శివాయిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి యేసుక్రీస్తు చూపిన సన్మార్గం ఆచరణీయమన్నారు. కార్యక్రమంలో పాస్టర్ దేవవరం, సాల్మాన్‌రాజ్, సభ్యులు భూషణం, పద్మారావు, అనంతరావు, సంగయ్య, సందీప్, చిన్ని, రోనీ, రాబర్ట్‌సాయిలు, మాణిక్యం, మహేశ్, సతీశ్ తదితరులున్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

వినాయక నవరాత్రి ఉత్సవాలు జిల్లావ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.


తూప్రాన్: పూజలో వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు


మెదక్‌మున్సిపాలిటీ: గోల్కొండ వీధిలో భక్తుల పూజలు


మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్‌లో..


వరి పంటలో పేరుకుపోయిన ఇసుకమేట


భారీ వర్షాలకు కొట్టుకుపోయిన నీలకంఠపల్లి రోడ్డు

భారీ వర్షాలతో రోడ్లు ధ్వంసం

చెరువులు, కుంటలకు గండ్లు

అల్లాదుర్గం(మెదక్): భారీ వర్షాలకు మండలంలో రోడ్లు ధ్వంసమయ్యాయి. చెరువులు , కుంటలకు గండ్లు పడ్డాయి. రైతులకు అపార నష్టం జరిగింది. మండల శివారులోని బంటికుంటకు గండి పడటంతో , చెరువు కింద వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరి పంటల్లో ఇసుక పేరుకుపోయింది. చెరువుకు గండిపడటంతో అల్లాదుర్గం గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా కోతకు గురై గుంతలు ఏర్పడ్డాయి. అప్పాజీపల్లి మధిర గ్రామమైన నీలకంఠపల్లి రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కాయిదంపల్లి , గడిపెద్దాపూర్‌లో చెరువు కాలువలకు గండ్లు పడ్డాయి. రోడ్లు, గండ్లు పడిన చెరువులకు వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

వర్షానికి రోడ్లు ధ్వంసం

రేగోడ్(మెదక్): మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షానికి రేగోడ్-పట్టీపొలం తండా బీటీ రోడ్డు ధ్వంసమైంది. ఈ వర్షానికి తండా దగ్గర రోడ్డు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. మళ్లీ వర్షాలు కురిస్తే రోడ్డు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అలాగే రేగోడ్-మర్పల్లి, పోచారం-రాయిపల్లి రోడ్లు సైతం దెబ్బతిన్నాయన్నారు. ఈ కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికై నా ప్రభుత్వం స్పందించి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులను ఆదుకుంటాం

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు

పాపన్నపేట(మెదక్): ఇటీవల వరదల్లో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఇటీవల మరణించిన నాగ్సాన్‌పల్లి మాజీ సర్పంచ్ భూదేవి కుటుంబీకులను ఆదివారం పరామర్శించారు. అనంతరం కుర్తివాడలో మునిగిపోయిన పంట పొలాలను పరిశీలంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 40 శాతం పంటకు నష్టం జరిగిందన్నారు. కుర్తివాడలో సుమారు 800 ఎకరాల పంట నీటమునిగిందని చెప్పారు. ఆయన వెంట కిసాన్‌సెల్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంత్‌రావు

ప్రమాదమని తెలిసినా..!


ప్రమాదకరంగా తాడును పట్టుకొని ఎక్కుతున్న ప్రజలు

హవేళిఘణాపూర్(మెదక్): ఇటీవల కురిసిన వర్షాలకు వరదలతో పోచారం డ్యాం కొట్టుకుపోయింది. ఈ మేరకు డ్యాం కిం బ్రిడ్జి వద్ద కార్మికులు పని చేసేందుకు అవతలి వైపు వెళ్లేందుకు వీలుగా తాడును ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇదే అదునుగా భావించిన కొంతమంది ప్రయాణికులు మెదక్ నుంచి నాగిరెడ్డిపేటకు వెళ్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జికు పక్క నుంచి నిత్యం తాడును పట్టుకొని పైకి, కిందకు వెళ్తున్నారు. ప్రమాదమని తెలిసినా ప్రయాణం తప్పదనేలా తాడు సహాయంతో నిత్యం వెళ్తున్నారు. మరో రెండు రోజుల్లో తాత్కాలికంగా రోడ్డు పనులు చేస్తున్న క్రమంలో ఇలా ప్రమాదకరంగా వెళ్లడం ఏంటని, కాలుజారితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు.

'అపూర్వ' సమ్మేళనం

నర్సాపూర్: చిన్న నాటి /జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ చాలా ఉల్లాసంగా ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, పాఠశాలలో 1988–89లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు ఆదివారం దౌల్తాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాలులో పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన పలువురు ఉపాధ్యాయులు మల్లారెడ్డి, రుక్మయ్య, వీరేశం, దశరథ, ఇందిర, గోవిందమ్మలను సన్మానించారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 1991–92 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన ఆనాటి ఉపాధ్యాయులు శంకర్, రాములు, విశ్వనాథం, మాణిక్యం, రాజేశ్వర్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మెదక్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, ఉపాధ్యాయులు వేణుగోపాల్, మంగ, జాల రాము, సత్యనారాయణ, నర్సింహులు, ఉపేందర్‌రెడ్డి, సాయిలు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.


చిన్నశంకరంపేట జెడ్పీపాఠశాలలో..


నర్సాపూర్: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తండావాసులకు సరుకుల పంపిణీ

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి సహకారంతో ఆదివారం దూప్‌సింగ్ తండాకు చెందిన గిరిజనులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు బీఆర్ఎస్ నాయకుడు మేకల సాయిలు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదనే విషయాన్ని తెలుసుకొని తండాలో ఉన్న కుటుంబాలకు అందరికీ నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వాడి మాజీ సర్పంచ్ యామిరెడ్డి, నాయకులు సిద్దిరాంరెడ్డి, భిక్షపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, మల్లయ్య, రవి, దేవిసింగ్, పెంట్యా, బద్రు, సురేశ్, వెంకట్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసర సరుకులు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు